క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ మహిళ కమిటీ ఎన్నిక

బల్మూర్: మండలంలోని జినుకుంటలో గురువారం బీఆర్‌ఎస్‌ పార్టీ మహిళ విభాగం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌ తెలిపారు. అధ్యక్షురాలిగా అంజనమ్మ, ప్రధాన కార్యదర్శిగా మంగమ్మ, ఉపాధ్యక్షులుగా పోలే పద్మ, మందరి విజయతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

కందనూలు: ఆర్టీసీ బస్సుల వేళలు, కార్గో సేవలు, రూట్లలో ఎదురవుతున్న సమస్యలు, ఇతర అంశాలకు సంబంధించి శుక్రవారం నాగర్‌కర్నూల్‌ డిపో మేనేజర్‌తో డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న డీఎం ధరమ్‌సింగ్‌ గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో 9959226288 నంబర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారని, నాగర్‌కర్నూల్‌ ఆర్టీసీ డిపో పరిధిలోని వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెంబర్‌కు ఫోన్‌ చేసి తన దృష్టికి తీసుకరావచ్చని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటకు చెందిన బాలస్వామి అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మృతిచెందాడు. ఐక్యతా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయాన్ని సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ నాగరాజు, ప్రభాకర్‌, భీమయ్య, శ్రీపతిరాజు, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో గురువారం రోజున పలు అనారోగ్య కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పలువురు ఆర్థికసాయాన్ని అందజేశారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌ కాలనీకి చెందిన అయాస్‌ (30) అనారోగ్యంతో మృతిచెందాడు. అతని కుటుంబాన్ని పరామర్శించిన నవీన హాస్పిటల్‌ ఎండీ రాజవర్ధన్‌ రెడ్డి తక్షణ సాయంగా రూ.10వేలతో పాటుగా ముందు భవిష్యత్‌లో కుటుంబానికి సాయం చేస్తానని తెలిపారు. ఐక్యతా ఫౌండేషన్‌, టీఆర్‌ఎస్‌ నాయకుడు గోలిశ్రీనివాస్‌ రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా ఉంటామని తెలిపారు. అదేవిధంగా జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బాలాజీ సింగ్‌ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇటీవల పట్టణంలోని సుభాష్‌నగర్‌ కాలనీలో అనారోగ్య కారణాలతో మరణించిన నారాయణచారి కుటుంబాన్ని మున్సిపల్‌ చైర్మన్‌ సత్యం కౌన్సిలర్లతో కలిసి పరామర్శించారు. కిష్టారెడ్డి మెమోరియల్‌ ఫౌండేషన్‌ ద్వారా కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి చెందిన సిరివెన్నెల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గురువారం జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. అనంతరం కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: అనారోగ్యాలతో మరణించిన వారి కుటుంబాలను గురువారం నాయకులు పరామర్శించారు. పట్టణంలోని 11వ వార్డుకు చెందిన గౌరమోని నర్సింహగౌడ్‌ అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. 17వ వార్డులో ఎండీ ఖదీర్‌ అనారోగ్యంతో మరణించాడు. బాధిత కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావు పరామర్శించారు.

బెల్లం పానకం ధ్వంసం

కోడేరు: మండలంలోని నార్యనాయక్‌తండా, తాగూరు తండాలో ఎక్సైజ్‌ సీఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 10 లీటర్ల సారా, 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనా నాటుసారా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సారా పట్టివేత

బల్మూర్: మండలంలోని గోదల్‌ సమీపంలో గురువారం ఉదయం అక్రమంగా సారాను తరలిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెంబడించి పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. మండలంలోని నర్సాయపల్లి చెందిన రవి ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తున్నడనే సమాచారం మేరకు పట్టుకోగా 10 లీటర్లు లభించినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దాడిచేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లికి చెందిన కొట్టె శ్రీనివాసులుపై బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన బొల్లు మల్లయ్య దాడి చేసి గాయపర్చినట్లు బాధితుని భార్య కొట్టె తిర్పతమ్మ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్‌ తెలిపారు. ఇంటి వద్ద దారి విషయంలో గొడవపడిన బొల్లు మల్లయ్య ఉద్దేశపూర్వకంగా దాడిచేసి తన భర్త శ్రీనివాసులును గాయపర్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటివెలుగు' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కంటివెలుగు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. శిబిరాలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అత్యాధునిక పద్ధతిలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అద్దాలు ఇచ్చి, అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తుందని వివరించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలు ప్రజలతో కిటకిటలాడాయి. – సాక్షి, నెట్‌వర్క్‌


తాడూరులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ మనుచౌదరి


పెద్దకొత్తపల్లిలో..


చారకొండలో కంటి పరీక్ష చేయించుకుంటున్న జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బాలాజీ సింగ్‌


లింగాల సీహెచ్‌సీలో కంటి వెలుగు అమలును పరిశీలిస్తున్న డీపీఓ, ఎంపీడీఓ

యువజన కాంగ్రెస్‌ నాయకుల అరెస్ట్‌


కల్వకుర్తిలో అరెస్టయిన కాంగ్రెస్‌ కార్యకర్తలు

కల్వకుర్తి: పోలీస్‌ నియామకాలలో అవకతవకలు సరిచేయాలని డిమాండ్‌ చేయడంతో పాటు అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కార్యకర్తలు నాగర్‌కర్నూల్‌ వెళ్లకుండా గురువారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు విజయకుమార్‌ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలను అరెస్టు చేయడం దారుణమన్నరు.

పెద్దకొత్తపల్లి: పోలీస్‌ నియామకంలో అవకతవకలను నిరసిస్తూ యూత్‌ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో రామస్వామి, ఆనంద్‌, చెన్నయ్య, వెంకటయ్య, శివ ఉన్నారు.

కొల్లాపూర్: కాంగ్రెస్‌ నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్‌ పరీక్షల్లో అవకతవకలను నిరసిస్తూ కలెక్టరేట్‌ ముట్టడి కార్యక్రమం చేపట్టడంతో ముందస్తుగా కాంగ్రెస్‌ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో పట్టణ అధ్యక్షుడు కాంతారావు, బాబా, కురుమయ్య, మౌలాలి, శివానందం ఉన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

లింగాల: యాసంగిలో సాగు చేసిన వరి పంట విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రం శివారులో సాగు చేసిన వరి పైరును ఏఓ పరిశీలించారు. చలికి పంట ఎర్రబారుతుందని తెలిపారు. దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులను సూచించారు. మళ్లలో నీరును తగ్గించి జింక్‌ 2 గ్రాములు, సాఫ్‌ 2 గ్రాములు లీటర్‌ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు అవగాహన కల్పించారు.


లింగాల శివారులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

అధ్వానంగా మారిన బీటీ రోడ్డు


గుంతలమయమైన మారేడుమాందిన్నె బీటీ రోడ్డు

పెద్దకొత్తపల్లి: మారేడుమాందిన్నె బీటి రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ రోడ్డు పై ప్రయాణం చేసేవారికి అవస్థలు తప్పడం లేదు. సాతాపూర్‌ క్రాస్‌ రోడ్డు నుంచి యాపట్ల క్రాస్‌ రోడ్డు వరకు 5 కి.మీ.ల బీటీ రోడ్డు గుంతలమయమైంది. ఈ రోడ్డు పై అచ్చంపేట నుంచి ఆర్టీసీ బస్సులు ఉదయం, సాయంత్రం తిరుగుతాయి. రోడ్డు గుంతలమయం కావడం వలన డ్రైవర్‌లు ఈ రూట్‌ బస్సు నడపడానికి జంకుతున్నారు. 2010లో ప్రధానమంత్రి సడక్‌ యోజన కింద రూ.కోటితో చేపట్టిన రోడ్డు అంతా వర్షానికి కొట్టుకుపోయింది. రోడ్డు మరమ్మతు చేపట్టకపోవడంతో యాపట్ల, సాతాపూర్‌, మారేడు మాందిన్నె, వేడుకరావుపల్లి, తిరునాంపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

సాతాపూర్‌ నుంచి యాపట్ల క్రాస్‌ రోడ్డు వరకు రోడ్డు మరమ్మతు కోసం ఇటీవల ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్డు పనులు చేపడతామని ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



మన్ననూర్: స్కూల్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో పీజీ పట్టా 76 శాతం సంపాదించుకున్న గిరిజన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మోతీలాల్‌ను తోటి ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దశరథం, శ్రీధర్‌, శంకర్‌, మోతీలాల్‌, రామకృష్ణ, శ్రీను, నాగిని, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఈత చెట్లు దగ్ధం

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌ చెందిన బాలయ్యగౌడ్‌కు సంబంధించిన ఈత చెట్లను రెండు రోజుల క్రితం దగ్ధమయ్యాయి. కుటుంబ సభ్యుల మధ్య తగాదాలే ఇందుకు కారణమని గ్రామస్తులు తెలిపారు. బాలయ్యగౌడ్‌ తన భార్యకు ఆరోగ్యంగా బాగాలేక హైదరాబాద్‌లో చికిత్స నిమిత్తం వెళ్లగా, పెట్రోల్‌ పోసి చెట్లను దహనం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై గురువారం బాలయ్యగౌడ్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌ పేర్కొన్నారు.

వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వడ్డెర కమ్యూనిటీ హాల్‌ భవనానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు.

అన్నపై దాడిచేసిన తమ్ముడిపై కేసు

ఉప్పునుంతల: మండలంలోని లక్ష్మాపూర్‌లో గురువారం కుటుంబ విషయాల్లో గొడవపడి అన్న మడ్డి బాబుపై అతని తమ్ముడు మడ్డి కృష్ణయ్య దాడిచేసి గాయపర్చినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్‌ తెలిపారు. ఇటుకతో తలపై కొట్టగా గాయం కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిట్లు ఎస్‌ఐ తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం


కోడేరులో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు

కోడేరు: విద్యార్థుల భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశించేది పదో తరగతి. ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అంత సులువు కాదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి ముందుకు సాగుతున్నారు. ఏప్రిల్‌ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో వాటిని దృష్టిలో ఉంచుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాఠశాల సమయం కంటే గంట ముందే హాజరవుతున్నారు. మండల కేంద్రంతో పాటు కోడేరు మోడల్‌ స్కూల్‌, కస్తూర్బా, గురుకుల, రాజాపూర్‌, ఎత్తం, మైలారం, కొండ్రావుపల్లి, నర్సాయిపల్లి పాఠశాలలో 341మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ప్రతి పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

రెండు నెలలుగా ప్రత్యేక తరగతులు

మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ఆయా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రెండు నెలలుగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8:30 గంటల నుంచి 9:30గంటల వరకు, సాయంత్రం పాఠశాల ముగిశాక 4:30 గంటల నుంచి 5:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.


పరీక్షలకు సిద్ధమవుతున్నాం

తమ పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతుల వల్ల పాఠ్యాంశాలపై పట్టు వస్తుంది. పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాం.
– ఐశ్వర్య, ఇంగ్లిష్‌ మీడియం, 10వ తరగతి

సాధిస్తాం

ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండటంతో తాము వందశాతం ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు తీసుకువస్తాం.
– మధుకర్‌, తెలుగు మీడియం, 10వ తరగతి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వందశాతం ఫలితాలతో పాటు 10జీపీఏ గ్రేడ్‌ సాధిస్తాం. – కృష్ణయ్య, హెచ్‌ఎం, కోడేరు

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం


అచ్చంపేటలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ప్రభుత్వ విప్‌ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్‌ అనేక ఆరోగ్య పథకాలను అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్‌ గువ్వల బాలరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను గుర్తించి శిబిరానికి తీసుకువచ్చి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా బల్మూరు, ఉప్పునుంతల, వంగూరులో వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు.

కంటి చూపులో నిర్లక్ష్యం తగదు

బిజినేపల్లి: కంటి చూపు తక్కువ అయ్యిందని తెలిసిన కూడా చాలా మంది ఆర్థిక ఇబ్బందుల వలన ఆస్పత్రికి వెళ్లడం లేదని, అలాంటి వారి కోసమే సీఎం కేసీఆర్‌ ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం తిమ్మాజిపేట, ఆవంచ, పోతిరెడ్డిపల్లిలో కంటి వెలుగు శిబిరాలను ఆయన ప్రారంభించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

కొల్లాపూర్/పెంట్లవెల్లి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన, పెంట్లవెల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే కంటివెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వయస్సు మీదపడే కొద్ది కంటి సమస్యలు పెరుగుతుంటాయని, వారి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే కంటి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసిందని వివరించారు. దృష్టిలోపాలు గలవారికి కంటి అద్దాలు ప్రభుత్వమే అందిస్తుందన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లను కూడా చేయిస్తుందన్నారు.


బిజినేపల్లిలో ఆటో రిఫ్రాక్టర్‌లో కంటి సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి


పెంట్లవెల్లిలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కొల్లాపూర్‌ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి


కల్వకుర్తిలో కంటిపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'

కల్వకుర్తి టౌన్/వెల్దండ: ప్రజలందరికి అంధత్వ నివారణ కోసం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌ యాదవ్‌ అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్‌ చైర్మన్‌ సత్యంతో కలిసి ప్రారంభించారు. దృష్టిలోపంతో ప్రజలెవరు కూడా ఇబ్బందులు పడొద్దని, ప్రభుత్వమే నేరుగా వారికి కంటి పరీక్షలు చేస్తుందని గుర్తుచేశారు. అదేవిధంగా వెల్దండ మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యేఓయ ప్రారంభించారు

ఎస్టీయూ ఆధ్వర్యంలో ప్రచారం

తాడూరు: రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎస్టీయూ సంఘం నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్‌, మేడిపూర్‌ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ముందుండి పోరాటం చేసిందన్నారు. తమ సంఘం పోరాటాల ఫలితంగానే పాఠశాలలోని సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార దిశగా వచ్చాయన్నారు. ఎస్టీయూ నాయకుడు భుజంగరావ్‌ను బలపరిచామన్నారు. ఆయన గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మురళీ, సత్యనారాయణ, మల్లయ్య, కర్ణాకర్‌రెడ్డి, కార్తీక్‌ తదితరులు పాల్గొన్నారు.


ఐతోల్‌ పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి

కాంగ్రెస్‌ పార్టీలో చేరిక


కాంగ్రెస్‌ పార్టీలో చేరిన కార్యకర్తలతో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

మన్ననూర్: అమ్రాబాద్‌ మండలం వటువర్లపల్లిలో 80 మంది బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ సమక్షంలో గురువారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా బీఆర్‌ఎస్‌ నాయకులు హామీల ఆశలతో కార్యకర్తలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రత్యేకించి కార్పొరేషన్‌ లోన్లు, దళిత బంధు పేరుతో ఇంత కాలంగా ఆశల పల్లకిలో ఉంచారని విమర్శించారు. పార్టీలో చేరిన వారికి సీనియర్‌ కార్యకర్తలతో పాటు సముచిత స్థానం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో హుస్సేన్‌, చంద్రమౌళి, ఈదయ్య, మత్రు, వెంకటేష్‌, నిఖిల్‌, శ్రీను తదితరులు పాల్గొన్నారు.